సాక్షి ములుగు

ఆదివారం । 25 । జూన్ । 2023



రైళ్ల రద్దు కొనసాగింపు

డోర్నకల్ జంక్షన్ మీదుగా నడిచే పలు రైళ్ల రద్దును మరో ఏడు రోజులు పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో▸



స్కూల్ బస్సులపై దాడులు

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలు పాటించని బస్సులపై కేసు నమోదు చేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0°/25.0°

వాతావరణం

జిల్లాలో చల్లటి వాతావరణం ఉంటుంది. పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హరే కృష్ణ భక్తుల సందడి



మంగపేట: మండల పరిధిలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హరే కృష్ణ భక్తులు సందడి చేశారు. ఈ మేరకు శనివారం లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దీంతో హరేకృష్ణ భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

జగదీశ్ కుటుంబానికి బీఆర్‌ఎస్ అండ



ములుగు రూరల్: ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని రెడ్కో చైర్మన్ యారువ సతీష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతిలు అన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి జగదీశ్ కుటుంబానికి ప్రకటించిన రూ.10 లక్షల చెక్కును పంపించగా కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని తెలిపారు. వారి వెంట గ్రంథాలయ చైర్మన్ గోవింద్‌నాయక్, మండల అధ్యక్షులు బాదం ప్రవీణ్, రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, కొమ్మరబోయిన వేణు, సునీల్‌కుమార్, రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మల్క రమేష్, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 24 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ కోర్సుల రెండవ, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ పట్టుబడి 24 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. ఈమేరకు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెసా గ్రామసభ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని సూరవీడు పంచాయతీ కె కొండాపురంలో శనివారం ఇసుక రీచ్ నిర్వహణకు పెసా గ్రామసభను సర్పంచ్ కుంజా గంగా అధ్యక్షతన అధికారులు నిర్వహించారు. ఇసుక రీచ్ నిర్వహణను గ్రామంలోని మహిళా గిరిజన సొసైటీ నిర్వహించేందుకు గ్రామసభ ఏక గ్రీవంగా తీర్మానించింది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా పెసా కొఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, ఎంపీడీఓ అద్దూరి బాబు, పెసా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో సర్జరీల నిర్వహణపై సమావేశం

ఎంజీఎం: హైదరాబాద్‌లో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న కాక్లియర్ సర్జరీలను ఎంజీఎంలో నిర్వహించే దిశగా ఎంజీఎం పరిపాలనాధికారులు అడుగులు వేస్తున్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక ఆడియోలాజిస్ట్ ఎంజీఎం ఆస్పత్రికి వచ్చారు. కాక్లియర్ సర్జరీ నిర్వహించే ఏర్పాట్లపై ఎంజీఎం పరిపాలనాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతంలో మంత్రి హరీశ్‌రావు వరంగల్‌ను సందర్శించిన క్రమంలో ఎంజీఎంలో కాక్లియర్ సర్జరీ ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించిన సందర్భంలో ఆస్పత్రిలో బేర మిషన్ అందుబాటులో లేదనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రికి బేర పరికరం సైతం అందుబాటులోకి రావడంతో ఈఎన్టీ విభాగంలో నిర్వహించే కాక్లియర్ సర్జరీని ఎంజీఎం సైతం త్వరలో చేపట్టాలనే ఉద్దేశంతో అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈక్రమంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసర్జరీ నిర్వహించాలంటే ప్రైవేట్ ఆస్పత్రిలో సుమారు రూ.1.50 లక్షల నుంచి రెండు లక్షల వరకు ఖర్చవుతుంది. ఇలాంటి సర్జరీలను సైతం ప్రభుత్వాస్పత్రిలోనే నిర్వహించాలనే ఉద్దేశంతో అధికారులు ముందుకు సాగుతున్నారు.

చౌకగా వ్యవసాయ పనిముట్లు

రైతులకు అందించేందుకు పీఏసీఎస్‌ల ప్రణాళిక

- సెంటర్లకు చేరిన యంత్రాలు
- మల్చింగ్, బిందు సేద్యంపై ప్రోత్సాహం



రైతులకు అందించే పైపులు

ఏటూరునాగారం: రైతులకు చౌకగా వ్యవసాయ పనిముట్లు అందించేందుకు పీఏసీఎస్‌లు తగిన ప్రణాళికలు రూపొందించాయి. ఆ దిశగా ఆయా సెంటర్లకు పనిముట్లను అధికారులు చేర్చారు. మార్కెట్‌లో లభించే వాటికంటే చౌకగా ధర ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలో ఇంచర్ల, ములుగు, నర్సాపురం, లక్ష్మీదేవిపేట, గోవిందరావుపేట, వెంకటాపురం(ఎం), తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(కె) పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఈ 11 పీఏసీఎస్‌ల పరిధిలో వారి వారి మండలాలకు అనుగుణంగా వ్యవసాయ పనులకు ఉపయోగపడే యంత్రాలను అందుబాటులో ఉంచారు. ఏటూరునాగారం సబ్ డివిజన్ ప్రాంతంలో రైతులు ఎక్కువగా మల్చింగ్ విధానంపై మిర్చి పంట సాగుచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మిర్చి పంట ఎక్కువగా సాగు చేస్తే బిందు సేద్యం(డ్రిప్) పద్ధతిలో సాగు చేయాలని రైతులను పీఏసీఎస్ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. దీంతో రైతులు పీఏసీఎస్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

అందుబాటులో ఉండే యంత్రాలు

తైవాన్ పంప్ 4స్ట్రోక్ రూ.10వేలు, రూ.7,500, రూ. 6,500లు, డబుల్ బ్యాటరీ డబుల్ మోటార్ చార్జింగ్ పంపు రూ. 3,500లు, సింగిల్ బ్యాటరీ పంపు రూ. 2,800లు, మిస్ట్ డస్ట్ బ్లోయర్ పంపు రూ.12వేలకు లభిస్తోంది. మల్చింగ్ పేపర్ 25 మైక్రాన్స్ 800మీటర్లలకు రూ. 3,700లు, మల్చింగ్ 21 మైక్రాన్ 800 మీటర్లకు రూ. 3200లు లభిస్తోంది. అలాగే టార్పాలిన్ 30 ఫీట్లు పొడువు, 40 ఫీట్ల వెడల్పు రూ.3,300లు, 18 వెడల్పు, 24 పొడువు రూ.1500లు, ఒక పీవీసీ పైపు 2 అంగులాల మందం రూ. 350లు, పీవీసీ 2.50 అంగులాల మందం రూ. 460లకు లభిస్తోంది. ఫ్లాట్ ల్యాటర్ పైపులకు 500 మీటర్లకు రూ. 2,500లు, రౌండ్ ల్యాటర్ పైపునకు 500ల మీటర్లకు రూ.2వేలు, 400మీటర్లకు రూ. 1500లకు లభిస్తోంది. అలాగే యూరియా ఒక బస్తాకు రూ.275లు, డీఏపీ ఒక బస్తాకు రూ.1,350లకు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు రైతులకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కావాల్సిన వారికి అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.









డ్రిప్‌కు ఉపయోగించే మోటారు, మిషనరీలు

ల్యాటర్ పైపులు

ఆధునిక పద్ధతికి ప్రోత్సాహం..



ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు రైతులకు పనిముట్లను మార్కెట్‌లో లభించే దానికంటే తక్కువగా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశాం. కావాల్సిన డ్రిప్, ఇతర సామగ్రిని కూడా నిల్వ చేశాం. కావాల్సిన రైతులు వచ్చి కొనుగోలు చేయాలి. రైతులకు పనిముట్లపై అవగాహన కల్పించడంతో పాటు మిర్చి పంట సాగులో మల్చింగ్ పద్ధతిని అలవాటు చేస్తున్నాం.

– గౌరి, ఏటూరునాగారం పీఏసీఎస్ సీఈఓ

రామప్పలో పర్యాటకుల సందడి



రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పర్యాటకులు

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చి రామప్ప రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు పర్యాటకులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేష్‌లు పర్యాటకులకు వివరించారు. అనంతరం పర్యాటకులు సరస్సు కట్టకు చేరుకొని సరస్సులో బోటింగ్ చేస్తూ సరస్సు అందాలను తిలకించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

వెంకటాపురం(ఎం): వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య సూచించారు. మండల పరిధిలోని తిమ్మాపూర్, లక్ష్మీదేవిపేట సబ్‌సెంటర్‌లను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రిజిస్టర్, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రజలు పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే జిల్లా ఆస్పత్రికి సిఫారసు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు స్వర్ణలత, శోభా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని అందుగులమీది గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు విరాళంగా గ్రామస్తులకు డీఎంహెచ్‌ఓ అప్పయ్య అందజేశారు. అదే విధంగా 30 మంది యువకులకు టీషర్ట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు వెంకటేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

త్వరలోనే గ్రంథాలయం అందుబాటులోకి..



పనులను పరిశీలిస్తున్న గోవింద్‌నాయక్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని నూతనంగా నిర్మాణం చేస్తున్న గ్రంథాలయాన్ని త్వరలోనే పాఠకులకు అందుబాటులోకి తీసుకువస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో గ్రంథాలయ భవన మరమ్మతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఇదివరకు ఉన్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేస్తున్నారని తెలిపారు. ఆ పనులు తుదిదశకు చేరాయని తెలిపారు. త్వరలోనే గ్రంథాలయాన్ని ప్రారంభించి పాఠకులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఆయన వెంట కూనూరు మహేష్ గౌడ్, బైకాని ఓదెలు, రాజు, నవీన్ పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిని అరికట్టాలి



హాజరైన ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు అంగన్‌వాడీలు



వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

- ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి మంకిడి వెంకటేశ్వర్లు

ఏటూరునాగారం: పిల్లల్లో వ్యాపిస్తున్న సికిల్ సెల్ వ్యాధిని అరికట్టడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి, రొయ్యూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి మంకిడి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులతో సికిల్ సెల్ వ్యాధి సర్వేపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సికిల్ సెల్ వ్యాధి గుర్తింపునకు రేపటి నుంచి 30వ తేదీ వరకు సర్వే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది బృందాలుగా అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి పరీక్షలు చేస్తారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. గ్రామాల్లో రక్త సంబంధీకులు, బాల్య వివాహాలు ఎక్కువగా జరగడంతోనే ఈ వ్యాధి వ్యాప్తికి కారణమవుతుందన్నారు. గ్రామాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు పల్లెల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, వైద్యాధికారి సుమలత, ఎంపీడీఓ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ కమల, సీహెచ్‌ఓ శారద, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదిగలను అణిచివేస్తున్న ప్రభుత్వాలు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఏటూరునాగారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలను అణిచివేస్తున్నాయని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీనివాస్ కల్యాణ మండపంలో ఎస్సీ రిజర్వేషన్ల చట్టబద్ధతకు శనివారం ఏర్పాటు చేసిన జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ర్యాలీగా కల్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంద కృష్ణమాదిగ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీల్లో ఒక్క మాదిగ మంత్రి కూడా లేడన్నారు. ఎక్కువ శాతంలో ఉన్న మాదిగలను మంత్రులను చేయకుండా తక్కువ శాతంలో ఉన్న అగ్రవర్ణ కులాలకు చెందిన వారిని చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణను మాలలు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కూడా మాదిగల ఓట్లను దండుకొని మోసం చేస్తున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటుతో ఆ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట ఉన్న తనలాంటి నాయకులను పక్కన బెట్టడం బాధాకరమన్నారు. ఖమ్మం జిల్లాలో కమ్మ కులస్తుల కోసం ఒక మంత్రిని ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మాదిగలకు సమస్యలు, కష్టాలు వస్తే ఏ నాయకుడి దగ్గరికి వెళ్లాలో తెలియని అయోమయం పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. రాష్ట్ర సాధనలో 1200ల మంది బలిదానాలు చేస్తే అందులో ఎక్కువ శాతం మాదిగలే ఉన్నారని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో మహాజన సోషలిస్టు పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు దేపాక మల్లమ్మ, నెమలి నర్సయ్య, సతీష్, వావిలాల స్వామి, కర్నె గోపి, బుర్రి సతీష్, వావిలాల సాంబశివరావు, పడిదల సతీష్, దేపాక సతీష్, మందెపల్లి సత్యం, కల్లూరి కరుణాకర్, వాసంపెల్లి శంకర్, వాసంపెల్లి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్



డీపీఓ వెంకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ములుగు రూరల్: పంచాయతీల్లో మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు శనివారం ర్యాలీ నిర్వహించి అదనపు కలెక్టర్ వైవీ గణేశ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం సిబ్బందికి రూ.19 వేలు వేతనం చెల్లించాలన్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం పంచాయతీ కార్మికులకు రూ. 15 వేలు, బిల్ కలెక్టర్, కారోబార్‌లకు రూ.19,500 చెల్లించాలని కోరారు. అర్హత కలిగిన బిల్ కలెక్టర్‌లు, కారోబార్‌లను పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్ అందించాలన్నారు. రాష్ట్రంలో ఇతర రంగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచి పంచాయతీ కార్మికులకు మాత్రమే పెంచకపోవడం సరికాదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మల్టీపర్పస్ విధానంలో కార్మికుల నుంచి బలవంతంగా బాండ్ పేపర్లపై సంతకాలు చేయించుకుని ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బడిమే సదయ్య, జితేందర్, కొమురెల్లి, రవి, నారాయణ, ప్రసాద్, సతీశ్, సమ్మయ్య, రాజు, నర్సమ్మ, ఆదినారాయణ, కొమురమ్మ, తిరుపతి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

సరుకుల్లో నాణ్యత లోపించొద్దు



టెండర్లను పరిశీలిస్తున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: గురుకుల కళాశాలలు, పాఠశాలలకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లోపించొద్దని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో మహబూబాబాద్, ములుగు, జయశంకర్ జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు కోడిగుడ్లు, కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, శానిటేషన్ చేయించేందుకు శనివారం టెండర్లను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ అంకిత్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ పొందిన వ్యాపారులు సకాలంలో సరుకులు సరఫరా చేయాలన్నారు. నాణ్యతతో కూడిన సరుకులను సరఫరా చేయాల్సిన బాధ్యత గుత్తేదారులపై ఉందన్నారు. సరుకులు సరఫరా చేసే క్రమంలో అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అసమానతలు దూరం

- సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తస్లీమా

ఎస్ఎస్‌తాడ్వాయి: విద్యతోనే సమాజంలోని వివక్షత, అసమానతలు దూరమవుతాయని ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. మండల పరిధిలోని బయ్యక్కపేట సమీపంలోని ఆదివాసీ సమ్మక్క గొత్తికోయ గూడెంలో శనివారం ఏర్పాటు చేసిన భీం చిల్డ్రన్ హ్యాపీనెస్ సెంటర్ మూడో వార్షికోత్సవానికి తస్లీమా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆధునిక యుగంలోనూ జనజీవన స్రవంతికి దూరంగా దట్టమైన అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీలు గ్రామాలకు దగ్గరలో నివాసాలు ఏర్పాటు చేసుకుంటే విద్య, వైద్యంతో పాటు అన్ని వసతులను సమకూర్చుకోవచ్చన్నారు. సమాజంలో అసమానతలను రూపుమాపడానికి విద్య ఒకటే మార్గమన్నారు. ఆదివాసీ పిల్లలకు చదువు నేర్పిస్తున్న భీం చిల్డ్రన్ హ్యాపీనెస్ సెంటర్ సభ్యులను తస్లీమా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమలత, చైతన్య, ఇస్రం సంతోష్, నరేష్, శశిధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా నిట్



ప్రతిజ్ఞ చేయిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ క్యాంపస్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదామని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్ క్యాంపస్‌లో శనివారం స్వచ్ఛతా క్యాంప్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిట్‌ను స్వచ్ఛ క్యాంపస్‌గా, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను డస్ట్‌బిన్‌లో వేసేలా విద్యార్థులు, అధ్యాపకులు తోడ్పడాలని సూచించారు. ఏడాదిలో 100 గంటల పాటు క్యాంపస్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ నిట్ కోసం 300 మంది వలంటీర్లు నాలుగు గ్రూపులుగా పని చేయాలని సూచించారు.

వర్క్‌షాపు తనిఖీ చేసిన జీఎం

భూపాలపల్లి అర్బన్: వర్క్‌షాపును ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. వర్క్‌షాపులో పనిముట్లు, యంత్రాల పనితీరును పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న సూపర్‌వైజర్స్ కార్మికులు రక్షణ సూత్రాలు పాటిస్తూ సరైన ప్రణాళికలు అమలు చేయాలన్నారు. జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ డీజీఎం రామకృష్ణారెడ్డి, ఇంజనీర్లు వేణు, అరుణ్‌ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండల పరిధిలోని మేడారం ఐటీడీఏ అతిథి గృహంలో శనివారం సర్పంచులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మీ వంటి సంక్షేమ పథకాలు ఖచ్చితంగా అర్హులకు అందేవిధంగా నివేదికలు సిద్ధం చేయాలని సర్పంచులకు సూచించారు. పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వ మార్గదర్శకాలను తూచ తప్పకుండా పాటిస్తూ పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ వాణిశ్రీ, సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు గద్దం అరుణ, సర్పంచులు చిడం బాబురావు, గొంది శ్రీధర్, చిన్నక్క, జాజ చంద్రం, సరిత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలీస్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

వరంగల్ క్రైం: సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్ల తుది రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. ఈనెల 14 నుంచి మొదలైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో 7706 మందికి అవకాశం రాగా 6663 మందివి పరిశీలించారు. దీనికి గాను 20 కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తు సమయంలో తప్పులు దొర్లితే వాటిని సరిదిద్దుకునేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, పరిపాలన విభాగానికి చెందిన ఏవో, సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ వాయిదా

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఈనెల 26(సోమవారం)వ తేదీన జరగాల్సిన పోలీస్ గ్రీవెన్స్ అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు వరంగల్ పోలీస్ మిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం గ్రీవెన్స్ ఉంటుందని, ప్రజలు వినతులు అందించొచ్చని సీపీ తెలిపారు.

‘అనుమతి’..అసమ్మతి

విద్యుత్ శాఖలో వర్క్‌మెన్ కేడర్‌కే ‘ఫుల్‌టైమ్ అనుమతి’

- రాష్ట్ర ప్రధాన పోస్టులలో ఇతర కేటగిరీ ఉద్యోగులు
- యూనియన్‌కు రాష్ట్రంలో ఒక్కరికే అవకాశం
- గతంలో విద్యుత్ సంస్థల వారీగా యూనియన్‌కు ఒక్కరు..
- ఈ క్యాలెండర్ సంవత్సరంలో నిబంధనల్లో మార్పు
- ఎవరికి ఇవ్వాలో తేల్చుకోలేకపోతున్న యూనియన్‌లు

విద్యుత్ శాఖలో ఓ యూనియన్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న వ్యక్తి.. ఆ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం, సమావేశాలకు హాజరు కావడం, ఇతరత్రా యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు విధులకు హాజరు కాకుండా పూర్తి స్థాయిలో మినహాయింపు ఇస్తారు. దీనిని ‘ఫుల్‌టైమ్ అనుమతి’ అంటారు. ఇటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ.. అటు యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలు కాదని భావించి విద్యుత్ సంస్థలు ‘ఫుల్‌టైమ్ అనుమతి’ ఇస్తాయి. అయితే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క యూనియన్ నుంచి ఒక్కరికే అదీ వర్క్‌మెన్ క్యాడర్‌కే ‘ఫుల్‌టైమ్’ అనుమతి ఇస్తామని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిర్ణయంతో యూనియన్, వెల్ఫేర్ అసోసియేషన్ నేతల్లో అసమ్మతి నెలకొంది. -హన్మకొండ



ఒక్కో యూనియన్ నుంచి రాష్ట్రంలో ఒక్కరికే ‘ఫుల్‌టైమ్’

రాష్ట్రంలో టీఎస్ జెన్‌కో, టీఎస్ ట్రాన్స్‌కో, టీఎస్ దక్షిణ విద్యుత్ పంపిణీ మండలి, టీఎస్ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి ఉన్నాయి. గతంలో ఈ నాలుగు విద్యుత్ సంస్థల నుంచి యూనియన్‌కు ఒక్కరు చొప్పున ‘ఫుల్‌టైమ్’ అనుమతి తీసుకునే వారు. ప్రస్తుతం 2023 క్యాలెండర్ సంవత్సరంలో ఒక్కో యూనియన్ నుంచి రాష్ట్రంలో ఒక్కరికి మాత్రమే ఫుల్‌టైమ్ ఇవ్వాలని 2022 డిసెంబర్16న జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ కంపెనీస్ కో ఆర్డినేషన్ మీటింగ్‌లో నాలుగు విద్యుత్ యాజమాన్య సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. నాలుగు కంపెనీల్లో ఏదైని కంపెనీ నుంచైనా యూనియన్‌కు ఒక్కరు మాత్రమే ‘ఫుల్‌టైమ్’ అనుమతి తీసుకోవాలి.

‘ఫుల్‌టైమ్’ అంశం పక్కకు..

2023 క్యాలెండర్ సంవత్సరం సగం పూర్తయినా యూనియన్‌లు ఇప్పటికీ నిర్ధారణకు రాలేకపోయాయి. ఒక్క యూనియన్, రెండు అసోసియేషన్లు మినహా మిగతా సంఘాలు ఎటుతేల్చుకోలేక ‘ఫుల్‌టైమ్’ అంశాన్ని పక్కకు పెట్టినట్లు చర్చించుకుంటున్నారు.

వర్క్‌మెన్ క్యాడర్‌కే ‘ఫుల్‌టైమ్’..

ఇదిలా ఉండగా వర్క్‌మెన్ క్యాడర్‌కే ‘ఫుల్‌టైమ్’ ఇవ్వాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయించాయి. వర్క్‌మెన్ క్యాడర్ అంటే కింది స్థాయి ఉద్యోగులు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో జేఎల్ఎం నుంచి.. ఫోర్‌మెన్ వరకు.. ప్రోవెన్షియల్ (మినిస్టీరియల్) స్టాఫ్‌లో అటెండర్ స్థాయి నుంచి.. సీనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు వస్తారు. ఆ తరువాత స్థాయి వారు వర్క్‌మెన్ క్యాడర్ పరిధిలోకి రారు. అయితే పలు యూనియన్‌లకు వర్క్‌మెన్ క్యాడర్ పైస్థాయి ఉద్యోగంలో కొనసాగుతున్న జూనియర్ అకౌంట్స్ అఫీసర్‌లు రాష్ట్ర స్థాయి కీలక పదవుల్లో కొనసాగుతున్నారు. వీరు ఇప్పటి వరకు ‘ఫుల్‌టైమ్’ అనుమతితో యూనియన్ కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. ఇటీవలి నిర్ణయంతో వీరికి ‘ఫుల్‌టైమ్’ అవకాశం చేజారింది. ఉదాహరణకు టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో హనుమకొండ సర్కిల్‌లో పని చేస్తున్న రెండు ప్రధాన యూనియన్‌లలో ఒక యూనియన్‌కు ఒక్కరు రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా, మరో యూనియన్‌కు ఒక్కరు రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వీరు ఇరువురు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌లుగా ఉద్యోగం చేస్తున్నారు. అయితే జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ క్యాడర్ గెజిటెడ్ ఆఫీసర్ స్థాయి కిందకు రాదు. దీంతో తాము వర్క్‌మెన్ క్యాడర్ పరిధిలోకి వస్తామని జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌ల వాదన. వర్క్‌మెన్ క్యాడర్ దాటి ఆఫీసర్ క్యాడర్‌లోకి వెళ్లినందున వీరికి వర్క్‌మెన్ క్యాడర్ వర్తించదని యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి.

తేల్చులేకపోతున్న యూనియన్లు

అయితే ఇప్పటి వరకు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ జెన్‌కోలో ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న మాతంగి శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌లో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ముత్యం వెంకన్న, టీఎస్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ జెన్‌కో నుంచి రామకృష్ణ మాత్రమే ‘ఫుల్‌టైమ్’ అనుమతి పొందారు. మిగతా యూనియన్‌లు, అసోసియేషన్లు ‘ఫుల్‌టైమ్’ అనుమతిపై ఎటు తేల్చులేక పోతున్నాయి.

ఒక్కరికి మాత్రమే ‘ఫుల్‌టైమ్’..

గతంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104, టీఎస్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-327, టీఆర్‌వీకేఎస్, టీఎస్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ జెన్‌కో), టీఎస్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్, స్టేట్ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఓసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల నుంచి నాలుగు విద్యుత్ సంస్థల నుంచి నలుగురికి, రాష్ట్ర స్థాయిలో ఒక్కరికి చొప్పున ఒక్కో యూనియన్‌కు మొత్తం ఐదుగురు ఉద్యోగులు ‘ఫుల్‌టైమ్’ తీసుకునే వారు. ఈ లెక్కన నాలుగు యూనియన్‌లు, ఐదు వెల్ఫేర్ అసోసియేషన్‌ల నుంచి మొత్తం 45 మంది ఉద్యోగులు ‘ఫుల్‌టైమ్’ తీసుకునేవారు. వీరి సంఖ్య కుదించడంతో పాటు ఉద్యోగులు విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా యూనియన్, అసోసియేషన్ నుంచి రాష్ట్రానికి ఒక్కరికి మాత్రమే ‘ఫుల్‌టైమ్’ ఇవ్వాలని సంస్థల యాజమాన్యాలు నిర్ణయించాయి.

రైళ్ల రద్దు కొనసాగింపు

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ మీదుగా నడిచే పలు రైళ్ల రద్దును మరో ఏడు రోజులు పొడిగించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లలో ఇన్‌ఫ్రాస్ట్రక్చువల్ మరమ్మతుల కోసం డోర్నకల్ స్టేషన్ మీదుగా నడిచే భద్రాచలం రోడ్-విజయవాడ, విజయవాడ-భద్రాచలం రోడ్, కాజీపేట- విజయవాడ, విజయవాడ-కాజీపేట, భద్రాచలం రోడ్-బలార్షా, సిర్పూర్-భద్రాచలం రోడ్ రైళ్లను ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు రద్దు చేశారు. ప్రస్తుతం రోలింగ్ కారిడార్ ప్రోగ్రాం పని నిమిత్తం మరోసారి ఈ రైళ్లను ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

21న మిస్సింగ్.. 22న విశాఖలో ప్రత్యక్షం

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యంలో కొత్తకోణం



నూనావత్ వినయ్‌కుమార్

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం రాములుతండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నూనావత్ వినయ్‌కుమార్ అదృశ్యం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ నెల 21న (బుధవారం) రాత్రి కోల్‌కతా నుంచి విజయవాడ వరకు రైలులో వస్తూ అదృశ్యమైన విషయం తెలిసిందే. కాగా, పోలీసులు ఇతను 22న విశాఖపట్నంలోని ఓ బాయ్స్ హాస్టల్‌లో ఉన్నట్లు సీసీ పుటేజీల ద్వారా గుర్తించారు. మిస్సింగ్ అయిన వ్యక్తి మరుసటి రోజు విశాఖపట్నంలో ఎలా తేలాడన్నది అంతుపట్టడం లేదు. వినయ్‌కుమార్ అదృశ్యంపై గత గురువారం విజయవాడకు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారు విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి 10.26 నిమిషాలకు వినయ్‌కుమార్ తన తండ్రి సదాశివుడితో ఫోన్‌లో మాట్లాడిన టైం ఆధారంగా గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు కటక్..బోజ్‌పూర్ రైల్వే మార్గంలో పోలీసులు ట్రాక్ వెంట తనిఖీ చేపట్టినా ఎలాంటి ఆధారం కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

పది రోజులు హాస్టల్‌లోనే ఉన్నాడు..

బుధవారం రాత్రి కటక్..బోజ్‌పూర్ రైల్వే మార్గంలో రాత్రి వినయ్‌కుమార్ అదృశ్యమైనట్లు భావిస్తున్న పోలీసులకు అతని సెల్‌ఫోన్ కాల్ డాటా ఆధారంగా ఆరా తీశారు. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలోని 7 హిల్స్ అనే ఓ బాయ్స్ హాస్టల్ పరిధిలో వినయ్‌కుమార్ సెల్‌నంబర్ పనిచేసినట్లు గుర్తించారు. వెంటనే అక్కడినుంచి శనివారం ఉదయం రైల్వే పోలీసులతో విశాఖపట్నంలోని ఆ హాస్టల్ చేరుకున్న కుటుంబ సభ్యులు.. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఇరువురు కలిసి 7 హిల్స్ హాస్టల్ యజమాని, సిబ్బందితో వినయ్‌కుమార్‌పై ఆరా తీశారు. వారు ఆ పేరు గల వ్యక్తి పది రోజులుగా ఉన్నది నిజమేనని, రెండు రోజుల క్రితం బయటకు వెళ్లాడని, తిరిగి 22వ తేదీన వచ్చి మళ్లీ బ్యాగ్ తీసుకొని వెళ్లాడని చెప్పారు. అతను బయటికి వెళ్తున్నట్లు సీసీ కెమెరా ఫుటేజ్‌లో గుర్తించారు. రైలులో వస్తూ పడిపోయాడనుకున్న వ్యక్తి, తెల్లవారే విశాఖపట్నం ఎలా వచ్చాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. పది రోజులుగా హాస్టల్‌లో ఉన్నవాడు కోల్‌కతా నుంచి విజయవాడకు వస్తున్నట్లు తల్లిదండ్రులను ఎందుకు నమ్మించాడు.. అసలు సెల్‌ఫోన్ ఎందుకు స్విచ్ఛాఫ్ చేశాడు.. ఈ అదృశ్యం వెనకాల దాగి ఉన్న మిస్టరీ అంతుచిక్కడం లేదు. ఇదిలా ఉండగా ఐదు నెలల క్రితం ప్రేమించి పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న వినయ్‌కుమార్ ఏమైనా డిప్రెషన్‌లోకి వెళ్లాడా.. అసలు బతికే ఉన్నాడా, లేక ఎవరైనా కిడ్నాప్ చేశారా అన్నది మండలంలో చర్చనీయాంశంగా మారింది.

28న వరంగల్ డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ : వరంగల్ డీసీసీబీ మహాజన సభ ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి చింతలపూడి చిన్నారావు శనివారం తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన హనుమకొండ నక్కలగుట్టలోని పావడమ్స్ బ్లూ కాన్ఫరెన్స్ హాల్‌లో మహాజన సభ జరుగుతుందన్నారు. 28న ఉదయం 11 గంటలకు జరిగే ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పీఏసీఎస్ చైర్మన్‌లు, డీసీసీబీలో సభ్యత్వం కలిగిన ఆయా సహకార సంఘాల చైర్మన్లు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఆత్మకూరు: ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఓ హెడ్‌కానిస్టేబుల్.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన కొర్ర భీమ్‌సింగ్(54) జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. భీమ్‌సింగ్ కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. రూ.25 లక్షలు అప్పు చేయగా రూ. 6 లక్షల వరకు తిరిగి చెల్లించాడు. మిగిలిన అప్పు ఎలా తీర్చాలనే బెంగతో గురువారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు నగరంలోని ఓ ఆస్పత్రికి చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య వసంత శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమార్ తెలిపారు.

సీజీఆర్ఎఫ్ వరంగల్ చైర్మన్‌గా వేణుగోపాలచారి



వేణుగోపాలచారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరంగల్ ఎస్ఈ మధుసూదన్, డీఈ (టీ)ఆనందం

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) వరంగల్ చైర్మన్‌గా వేణుగోపాలచారి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా కొనసాగిన పెరుమాండ్ల సత్యనారాయణ పదవీకాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో టీఎస్ఈఆర్‌సీ వేణుగోపాలచారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని సీజీఆర్ఎఫ్ కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వేణుగోపాలచారిని ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ఐఎంఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం



ఉస్మాన్



ఇస్మాయిల్

న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మైనార్టీ గురుకులాల రికార్డులు, స్టాక్ మేనేజ్‌మెంట్ తదితర రికార్డుల తనిఖీ కోసం ఇన్వెంటరీ మాడ్యూల్ సిస్టమ్(ఐఎంఎస్) ఇన్‌చార్జ్‌లుగా హనుమకొండ(బీ1), మహబూబాబాద్(బీ1) గురుకులాల డిప్యూటీ వార్డెన్‌లు మహ్మద్ ఉస్మాన్, మహ్మద్ ఇస్మాయిల్‌ను నియమిస్తూ సెక్రటరీ షఫీయుల్లా ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 16 గురుకుల పాఠశాలలు, కళాశాలల డిప్యూటీ వార్డెన్‌లకు రికార్డ్ మెయింటనెన్స్, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డ్ అంశాలపై శిక్షణ ఇస్తారు. ఐఎంఎస్‌లుగా నియామకమైన ఇద్దరిని ప్రిన్సిపాళ్లు, డిప్యూటీ వార్డెన్‌లు అభినందించారు.

శరీరదాన అంగీకారపత్రాల అందజేత



అంగీకార పత్రాలు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఎంజీఎం : గొప్ప సంకల్పంతో తమ మరణానంతరం శరీరదానం చేస్తామని అంగీకరించిన పలువురు.. ఆ పత్రాలను శనివారం శరీర అవయవదాతల అసోసియేషన్ ప్రతినిధి, కేఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ పద్మజకు అందించారు. ఈ సందర్భంగా శరీర అవయవదాతల అసోసియేషన్ ప్రతినిధి మల్లారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా చనిపోతే వారి మృతదేహాలను మెడికల్ కాలేజీకి అప్పగించాలన్నారు. తద్వారా విద్యార్థులు వైద్య విద్య నేర్చుకుంటారని తెలిపారు. అనంతరం శరీర దానం చేస్తామని అంగీకారం పత్రం అందజేసిన 40 మందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ రావు యాదవ్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, కేదారి పాల్గొన్నారు.

ఈ-నామ్ సదస్సులో మార్కెట్ అధికారులు..

వరంగల్: గోవాలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన ఈ-నామ్ జాతీయ సదస్సులో వరంగల్ డీడీఎం రాజునాయక్, వరంగల్ మార్కెట్ కమిటీ కార్యదర్శి బీవీ రాహుల్‌లో పాల్గొన్నారు. మూడు రోజులు జరిగిన ఈసదస్సులో ఈ-నామ్ అమలుపై ఎదురవుతున్న ఇబ్బందులను మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి.. జాతీయ స్థాయి అధికారులకు వివరించినట్లు డీడీఎం రాజునాయక్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరంగల్, ఖమ్మం జిల్లాలో మిర్చి కొనుగోళ్లలో ఈ-నామ్ అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. సదస్సులో తెలంగాణ నుంచి రాష్ట్ర సహాయ సంచాలకుడు లక్ష్మణుడు పాల్గొన్నట్లు తెలిపారు.

స్కూల్ బస్సులపై రవాణాశాఖ దాడులు

- జిల్లా వ్యాప్తంగా తనిఖీలు
- నిబంధనలు పాటించని బస్సులపై కేసు
- గీతాంజలి స్కూల్ బస్సులపై చర్యలు
- వివరాలు వెల్లడించిన ఎంవీఐ రవీందర్



వివరాలు వెల్లడిస్తున్న ఎంవీఐ రవీందర్

ఖిలా వరంగల్ : ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. వరంగల్ జిల్లా ఆర్టీఓ అఫ్రీన్ సిద్దిఖీ ఆదేశాల మేరకు శనివారం ఉదయం వరంగల్ రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రహదారులపై కళాశాల, స్కూల్ బస్సులను ఆపి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించారు. అలాగే బస్సుల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను అదుపు చేసే అగ్నిమాపక యంత్రాల సిలిండర్ అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించారు. నర్సంపేటలో గీతాంజలి డీజీ స్కూల్ బస్సు వెనుక అద్దం లేకపోవడంతో అధికారులు గుర్తించి చర్యలు తీసుకున్నారు. బస్సుకు మిర్రర్ బిగించిన తర్వాత విద్యార్థులను తరలింపునకు అనుమతించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రవీందర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులను నడపాలన్నారు. ఫిట్‌నెస్ ఉన్న స్కూల్ బస్సుల్లో విద్యార్థులను తరలించాలని, లేనిపక్షంలో బస్సులను సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. అదేవిధంగా ఈనెల 30 వరకు విస్తృతంగా దాడులు నిర్వహించి నిబంధనలు పాటించని వాటిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవీఐ వెంకన్న, ఏఎంవీఐ శాలిని, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌కు అడ్డు వచ్చిన వానరం..

- కిందపడిన దంపతులు
- కోమాలోకి భార్య.. పరిస్థితి విషమం
- కొత్తపోచారంలో ఘటన



చికిత్స పొందుతున్న రూతమ్మ

గార్ల : దంపతులు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో వానరం అడ్డువచ్చింది. దీంతో సడన్ బ్రేక్ వేయగా.. భార్య బైక్ నుంచి పడి తీవ్రగాయాలపాలై కోమాలోకి వెళ్లి ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతోంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గార్ల మండలం కొత్తపోచారం గ్రామానికి చెందిన 4వ వార్డు సభ్యురాలు తిప్పారపు రూతమ్మ భర్త హనుమంతరావుతో కలిసి బైక్‌పై శుక్రవారం గార్లకు వచ్చారు. అనంతరం స్వగ్రామం వెళ్తుండగా గోపాలపురం సమీపంలో బైక్‌కు కోతి అడ్డొచ్చింది. దీంతో హనుమంతరావు సడన్ బ్రేక్ వేయగా వెనుక కూర్చున్న రూతమ్మ రోడ్డుపై పడింది. తల వెనుక భాగంలో తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే కోమాలోకి వెళ్లింది. క్షతగాత్రురాలిని హుటాహుటిన 108 ద్వారా ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కాగా, తమది నిరుపేద కుటుంబమని, కనీసం వైద్య ఖర్చులకు కూడా డబ్బు లేదని, దాతలు స్పందించి తన భార్యకు ప్రాణభిక్ష పెట్టాలని హనుమంతరావు వేడుకుంటున్నాడు. దాతలు 9573073641 నంబర్‌కు ఫోన్ పే చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు ‘ఓ’ సిటీ ప్లాట్లకు వేలం

కరీమాబాద్: వరంగల్ ‘ఓ’ సిటీలోని ‘కుడా’కు చెందిన ప్లాట్లకు ఆదివారం వేలం నిర్వహిస్తున్నట్లు ‘కుడా’ వైస్ చైర్మన్ రిజ్వాన్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్-నర్సంపేట రోడ్డులో ఉన్న 36 నివాసయోగ్య, 6 వాణిజ్యపర ప్లాట్లను వేలంలో విక్రయిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈఎండీ ద్వారా రూ. 25 వేలు, రూ. 50 వేల చొప్పున చెల్లించి టోకెన్ పొంది వేలంలో పాల్గొనాలన్నారు.